క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మోపిదేవి: మోపిదేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఉయ్యూరు ఈఈ డి. కృష్ణనాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో మోపిదేవి, బొబ్బర్లంక, కొక్కిలిగడ్డ, కె.కొత్తపాలెం, పెదప్రోలు, నాగాయితిప్ప, మోపిదేవిలంక, కోసూరువారిపాలెం గ్రామాల్లో ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు కౌన్సిల్ సమావేశం

పెడన: పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశంలో అజెండాలోని 22 అంశాల ఆమోదంపై చర్చ ఉంటుందన్నారు. సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సంబంధిత విభాగాధిపతులు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా ఆమె కోరారు.

రెవెన్యూ సదస్సుకు 9అర్జీలు

పెడన: మండలంలోని నందమూరు, మడక గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ తొమ్మిది అర్జీలు అందినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ కె. అనిల్‌కుమార్ తెలిపారు. ఆర్‌ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాక్సింగ్ డే



నాగాయలంక: రక్షణసైన్యం(సాల్వేషన్ ఆర్మీ) నాగాయలంక డీఓ ఆధ్వర్యంలో గురువారం సంస్థ అంతర్జాతీయ బాక్సింగ్ డేను ఘనంగా నిర్వహించారు. తొలుత సంఘ సభ్యులతో విస్తృత సమావేశం జరిపి బాక్సింగ్ అంశాలను వివరించారు. అనంతరం రక్షణసైన్యం జిల్లాఅధికారి(డి.ఓ) మేజర్ తెలగతోటి ప్రసాదరావు నేతృత్వంలో గ్రామంలోని వీధుల్లో సంచార జాతి పేదలు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు క్రిస్మస్ కేక్‌బాక్స్‌లు పంపిణీ చేశారు. మహిళా విభాగం జిల్లా అధికారి మేజర్ దీన రత్నకుమారి, మేజర్ జి.రత్నం, లెఫ్టినెంట్ రవి, అనిత, వసంతకుమారి, స్థానిక సంఘ వీరులు బందెల నాగబాబు, శివరామకృష్ణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

నాగాయలంక: వంగవీటి రంగా వర్ధంతి పురస్కరించుకుని మండల వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డిసి), కూటమి నాయకులు స్థానిక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. డి.సి అధ్యక్షుడు బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు (చినబాబు), టిడిపి అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు(చంటి) నేతృత్వంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. తొలుత రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అగ్నికుల క్షత్రియుల నేత లకనం నాగాంజనేయులు, భోగాది శివవిష్ణువర్ధన్, బండ్రెడ్డి మల్లికార్జున్, రేమాల బాబూరావు, బండ్రెడ్డి హరి, రంగా అభిమానులు పాల్గొన్నారు.

శిశుగృహకు దుప్పట్లు అందజేత



మచిలీపట్నంటౌన్: నగరంలోని పోర్టు రోడ్‌లోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న 8 మంది చిన్నారులకు మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం దుప్పట్లు, పండ్లు అందజేశారు. చిన్నారులకు అవసరమైన దుప్పట్లు, పండ్లు ఇవ్వాలని శిశుగృహ నిర్వాహకురాలు కోరడంతో మైత్రీ ఫౌండేషన్ సభ్యురాలు వక్కంటి రమాదేవి, ఆమె స్నేహితులు వీటిని శిశుగృహ నిర్వాహకులకు అందజేశారు.

వాస్తవ ప్రేమకథే 'డ్రింకర్ సాయి' చిత్రం

దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రస్తుత సమాజంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతూ, ప్రధానంగా యువతకు చక్కటి వినోదంతో పాటు సందేశాన్ని పంచే సినిమా 'డ్రింకర్ సాయి' అని ఆ చిత్ర దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి అన్నారు. హనుమాన్ జంక్షన్‌లోని కేఎస్ టాకీస్‌లో 'డ్రింకర్ సాయి' చిత్రం ప్రీమియర్ షో గురువారం ప్రదర్శించారు. దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి, చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి హీరో ధర్మ మహేష్ కుటుంబసభ్యులు, అభిమానులు సినిమా తిలకించారు. హీరో తండ్రి, కేఎస్ టాకీస్ అధినేత కాకాని వెంకటేశ్వరరావు (బాబు), తల్లి అరుణ, సోదరి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ధాన్యం రైతులు విలవిల

- లభించని గిట్టుబాటు ధర
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.2100 పలికిన ధాన్యం బస్తా
- ప్రస్తుతం రూ.1500 మించని ధర
- తీవ్ర ఆవేదనలో రైతులు



టి.కొత్తపాలెంలో వరిపనలు సంరక్షణపై ఆందోళన చెందుతున్న రైతు బండ్రెడ్డి రామారావు

నాగాయలంక: కూటమి ప్రభుత్వంలో ధాన్యానికి గిట్టుబాటు ధర లభించక రైతులు గగ్గోలుపెడుతున్నారు. అకాల వర్షాలు, తుఫాన్లను ఎదుర్కొని పంటలను పండిస్తే..తీరా గిట్టుబాటు ధర కూడా లభించకపోతే వ్యవసాయాన్ని ఎలా కొనసాగించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

నట్టేట ముంచిన సీఎం చంద్రబాబు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొత్త బీపీటీ ధాన్యం బస్తా ధర రూ.2100 పలుకగా, పాత ధాన్యం రూ.2500 కూడా పలికింది. కాని ప్రస్తుతం సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో ధాన్యం బస్తా రేటు రూ.1500 మించి పలకకపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ ఖర్చు కూడా దక్కలాలేవని వాపోతున్నారు. రైతులను నట్టేట ముంచాలంటే చంద్రబాబు పాలనే కరెక్ట్ అంటూ క్షేత్రస్థాయిలో రైతులు ఎద్దేవా చేసుకుంటుండం గమనార్హం.

పరిహారం పంపిణీలోనూ వివక్ష..

కొత్త ధాన్యం ధర కనీసం రూ.2వేలు పలికినా వరికోత మిషన్లతో పంటను త్వరితగతిన కోసుకుని అమ్ముకోవడానికి రైతులు సిద్ధపడేవారమని రైతులు చెబుతున్నారు. ధాన్యానికి గిట్టుబాటు ధర లభించకపోవడంతోపాటు తరచూ ముసురుపట్టి తరచూ వర్షపు జల్లులు కురుస్తుండటంతో నాగాయలంక మండలంలోని తీర గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరిపొలాలు దెబ్బతిన్న రైతులందరికీ ప్రభుత్వం పరిహారం అందించని వైనాన్ని గుర్తుచేస్తున్నారు. నష్టపరిహారం అందించడంలో వివక్ష చూపడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎకరానికి రూ.35వేలు నష్టపరిహారం ప్రకటించి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



కట్టుబడి సాధ్యంగాక పొలాల్లో నానిపోతూ ధాన్యం రాలిపోయే దశలో ఉన్న వరి కంకులు

వాతావరణ మార్పులపై ఆందోళన..

నాగాయలంక మండలంలో వరికోతలు మిగతా ప్రాంతాల కంటే ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. కోత పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో వాతావరణం పూర్తిగా మారడంతో పండిన పంట ఇంటికి చేరుతుందో లేదోననే ఆందోళన రైతులను మూడురోజులుగా కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మరో నాలుగు రోజులు వరికోతలు ఆపాలని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరించడంతో రైతాంగంలో దిక్కుతోచని స్థితి నెలకొంది. బీపీటీలు సాగుచేయడంతో వర్షపు జల్లులకు కోసిన పనలు, కోయని పంట పొలాల్లో సైతం ధాన్యం అత్యధికంగా రాలిపోయి దిగుబడి దక్కదని ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి వరిధాన్యానికి గత ప్రభుత్వంలో మాదిరి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి...



వరిధాన్యానికి గిట్టుబాటు ధర లభించకపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సాగుఖర్చులు ఏటా పెరుగుతుండగా, ధాన్యానికి గతేడాది ఉన్న ధర కూడా ఇవ్వకపోతే రైతులకు ఎలా గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలి. బస్తా ధాన్యానికి రూ.2500 ఇవ్వాలి. తేమశాతం పేరుతో వ్యాపారులు, మిల్లర్లు చేస్తున్న దోపిడీకి అడ్డుకట్ట వేయాలి.

బీసాబత్తుని ప్రసాద్, డీసీ మాజీచైర్మన్

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన నేడు

పెడన: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన చేపడుతున్నట్లు పెడన వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉదయం పది గంటలకు పార్టీ కార్యాలయం నుంచి నిరసన తెలియజేస్తూ ప్రదర్శనగా మార్కెట్‌యార్డు సమీపంలోని విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేయనున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథిగా పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము హాజరవుతారని, పెడన నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్ సీపీ శ్రేణులంతా హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

నిరసన కార్యక్రమానికి తరలిరావాలి..

మోపిదేవి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పెంచిన విద్యుత్‌చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ అవనిగడ్డలో శుక్రవారం చేపట్టే నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆపార్టీ మోపిదేవి మండల కన్వీనర్ గరికపాటి వెంకటేశ్వరావు కోరారు. మాజీఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన సూచించారు.

పోరుబాటను విజయవంతం చేయండి

అవనిగడ్డ: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పోరుబాట కార్యక్రమానికి పార్టీనాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని మాజీఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పిలుపునిచ్చారు. పోరుబాటలో భాగంగా ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరి కోడూరు రోడ్డులోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి చేరుకుంటామన్నారు. అనంతరం ఏడీఏకి వినతిపత్రం అందజేస్తామని వివరించారు. పోరుబాటకు అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని సింహాద్రి రమేష్‌బాబు కోరారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవాలు



శ్రీకాకుళంలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

శ్రీకాకుళం(ఘంటసాల): ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఐ తనవంతు పోరాటాలు చేస్తూనే ఉంటుందని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం, సూరపనేనిపాలెం, తెలుగురావుపాలెం, ఘంటసాల గ్రామాల్లో సీపీఐ శత వార్షికోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలోని అమరవీరుల స్తూపం వద్ద నడికట్ల బిక్షంరాజు, ఆత్కూరి సీతారామయ్య స్మారక స్తూపం వద్ద గాజుల వెంకటనరసయ్య, సూరపనేని పాలెంలోని చావలి బుల్లితాత స్మారక స్తూపం వద్ద నడికట్ల అర్జునరావు, ఘంటసాలలోని స్మారక స్తూపం వద్ద కోదాటి నాగయ్య సీపీఐ జెండాలను ఆవిష్కరించారు. అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీపీఐ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం మహోజ్వల పోరాటాలు చేసిందన్నారు. కార్మికవర్గ సైద్ధాంతిక శక్తిగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. ఆయా ఉద్యమాల్లో ఎందరో మహానేతలు ప్రాణాలో కోల్పోయారంటూ వారందరికీ నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ కార్యదర్శి కోడి రాధాకృష్ణమూర్తి, కోడి శ్రీనివాసరావు, ఆత్కూరి సీతారామరాజు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కనులపండువగా పడి పూజోత్సవాలు



కోడూరు: కోడూరు అయ్యప్పస్వామివారి ఆలయంలో 20వ మహా పడిపూజోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. గురువారం ఉదయం వేదపండితుల మంత్రవచనాల నడుమ స్వామివారి మూలమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు అయ్యప్ప మాల ధరించిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం మాలికాపురొత్తమ్మ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేశారు. మహిళలు ఈ కుంకుమార్చనలో పాల్గొని భక్తిభావం చాటుకున్నారు. శుక్రవారం ఉదయం కేరళ తరహాలో అయ్యప్ప ఉత్సవమూర్తికి లక్ష రూపాయి నాణేలతో అభిషేకం చేయనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భవన్నారాయణ తెలిపారు.

ఎంపీపీ రజనీకుమారికి మాజీఎమ్మెల్యే పరామర్శ



వేమూరి రాజ్యలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు తదితరులు

ఘంటసాల: ఎంపీపీ వేమూరి రజనీకుమారి అత్త రాజ్యలక్ష్మి ఇటీవల మృతిచెందగా, విషయం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే, అవనిగడ్డ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సింహాద్రి రమేష్‌బాబు గురువారం పరామర్శించారు. రాజ్యలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ రజనీకుమారితోపాటు కుమారులు ప్రవీణ్, నవీన్, కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రజనీకుమారిని పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వేమూరి వెంకట్రావు, పీఏసీఎస్ మాజీ ఛైర్పర్సన్ వేమూరి రత్నశేఖర్, నాయకులు గొర్రెపాటి వెంకట్రావు, గొర్రెపాటి జగన్మోహనరావు, మధుసూదనరావు, గొర్రెపాటి గోపాలకృష్ణ, దేవినేని విజయ్‌కుమార్, ఆకురాతి భాస్కరరావు, వేమూరి రుత్విక్, కార్యకర్తలు ఉన్నారు.

రిటైర్డు టీచర్ విజయలక్ష్మికి నివాళి ..

రావివారిపాలెం(మోపిదేవి): మండలంలోని రావివారిపాలెంనకు చెందిన రిటైర్డు టీచర్ రావి విజయలక్ష్మి గురువారం తెల్లవారుజామున మృతిచెందగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విజయలక్ష్మికి నివాళులర్పించినవారిలో దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, కంఠంనేని శివశంకర్(పెద్దబాబు), పీఏసిఎస్ మాజీ చైర్‌పర్సన్ రావి రాంప్రసాద్, మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, ఎస్సీసెల్ మండల పార్టీ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, లింగం జగదీష్‌కుమార్, నందిగం శ్రీనివాసరావు, గరికిపాటి వెంకటేశ్వరావు, బాపట్ల కిశోర్ ఉన్నారు.

క్రీడా మైదానం అభివృద్ధికి శ్రీకారం



క్రీడా మైదానంలో పనులు పరిశీలిస్తున్న కుంపటి సుబ్బారావు, హెచ్‌ఎం వేణుగోపాలరావు

గొగినేనిపాలెం(ఘంటసాల): స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానం అభివృద్ధికి సహకారం అందిస్తున్న పూర్వ విద్యార్థుల సేవలు ఆదర్శనీయమని గొగినేనిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు అన్నారు. ఘంటసాల మండలం గొగినేనిపాలెం ఎన్జీ రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 4వతేదీ నుంచి 6వ తేదీ వరకు సెంట్రల్ జోన్ ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా హైస్కూల్ క్రీడా మైదానం అభివృద్ధి పనులను గురువారం చేపట్టారు. ఈ పనులను హెచ్‌ఎంతోపాటు గ్రామానికి చెందిన కుంపటి సుబ్బారావు పరిశీలించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం వేణుగోపాలరావు మాట్లాడుతూ 1987–88 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సహకారంతో క్రీడామైదానాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అందుకు సహకరించిన కుంపటి సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుంపటి చక్రవర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడిరైతుల సమస్యల పరిష్కారానికి కృషి



పాల ఉత్పత్తిదారులతో మాట్లాడుతున్న డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

పెడన: పాలఉత్పత్తిదారుల సమస్యలను పరిష్కరించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు తెలిపారు. 'పల్లెకుపోదాం పాడిని చూద్దాం' కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నందిగామ, కూడూరు గ్రామాల్లోని పాల ఉత్పత్తిదారుల సొసైటీలను గురువారం అయన సందర్శిం సందర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ యూనియన్ పాడి రైతులకు అందించే ధర పదిశాతం వెన్న గల పాలకు రూ.82లు, 10% బోనస్ కలుపుకొని రూ.90.20పైసలు ఇస్తున్నట్లు తెలిపారు. కళ్యాణమస్తు, క్షీరబంధు, ప్రతిభా, ఆక్సిడెంట్ కేర్ ట్రస్ట్ పథకాలతోపాటు పాడి పశువులకు అందించే పశు బీమా, డీ వార్మింగ్, పశు దాణా, కాల్షియం, మినరల్ మిక్సర్ వాడకంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యుడు అర్జా వెంకట్ నగేష్, గుడ్లవల్లేరు పాల శీతల కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘ అధ్యక్షులు జన్ను సీతయ్య, కాగిత వెంకట్రావు, సూపర్ వైజర్ పెయ్యేటి బసవరాజు కుమార్, సంఘ పాలక వర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి వీఎం రంగా కృషి



అవనిగడ్డలో వీఎం రంగాకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



మచిలీపట్నంలో రంగా వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

అవనిగడ్డ: వంగవీటి మోహనరంగా తన జీవితమంతా పేదల కోసమే పోరాడి వారి అభ్యున్నతికి విశేషంగా కృషిచేశారని మాజీఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం రంగా వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగాకు నివాళులర్పించినవారిలో రాధా రంగా మిత్రమండలి దివియూనిట్ అధ్యక్షుడు రాజనాల మాణిక్యాలరావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, గాజుల జయగోపాల్, తుంగల అంకారావు, సామర్ల రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

పెడనలో..

పెడన: పట్టణంలోని తోటమూల వద్ద గురువారం వంగవీటి మోహనరంగా వర్ధంతిని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు, కౌన్సిలర్ భళ్ల గంగయ్య, జయలక్ష్మి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మాదాసు బాబురావు, బుర్రా మహేష్, ఎస్సీ సెల్ పట్టణ ఉపాధ్యక్షుడు కోడూరు శ్రీను తదితరులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాగాయలంక మండలంలో..

నాగాయలంక: మండల శ్రీకనకదుర్గ శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వర్ధంతిని నిర్వహించారు. నాగాయలంక మోహన్‌రంగా సెంటర్‌లోని రంగా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రంగాకు నివాళులర్పించినవారిలో కాపు సంక్షేమ సంఘం భోగాది సోమశేఖర్(చిన్నారి),ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, భోగాది శేషగిరిరావు ఉన్నారు.

మోపిదేవి మండలంలో..

కె కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెం, పెదకళ్లేపల్లి గ్రామాల్లో వీఎం రంగా వర్ధంతిని నిర్వహించారు. రంగాకు నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, మాజీ సర్పంచ్ చందన సుబ్బారావు, మత్తి సాంబశివరావు, పూషడపు రత్నగోపాల్, నందీశ్వరావు, ఎంపీటీసీ సభ్యులు కడవకొల్లు సీతారామాంజనేయులు, అరజా ఆశాదేవీ, అరజా కిరణ్‌కాంత్, కేతరాజు శ్రీనివాసరావు, బాదర్ల లోలాక్షనాయుడు, గోళ్ల శ్రీనివాసరావు, గోళ్ల వెంకటసుబ్బారావు ఉన్నారు. మోపిదేవిలో కోసూరు రామాంజనేయులు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

కోడూరులో..

కోడూరు: స్థానిక ప్రధానసెంటర్, ఉల్లిపాలెం, వి.కొత్తపాలెం, పిట్టల్లంక గ్రామాల్లో రంగా వర్ధంతిని నిర్వహించారు. రంగాకు నివాళులర్పించిన వారిలో కూటమి నేతలు మర్రే గంగయ్య, బచ్చు వెంకటేష్, కొండవీటి రామకృష్ణ, సిద్ధినేని ఆశోక్ నాయుడు, కోట రాంబాబు, బడే వీరబాబు, పూతబోయిన సీతారత్నసాయిబాబు ఉన్నారు.

గూడూరు మండలంలో..

గూడూరు: గూడూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రంగా వర్ధంతిని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు పర్ణం మహాలక్ష్మయ్యనాయుడు, ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్‌రంగబాబు, కారుమంచి కామేశ్వరరావు, కోళ్ల బాలకృష్ణ, సమ్మెట జయవర్ధన్, బత్తిన స్వామి, అట్టూరి వెంకటేశ్వరరావు, జక్కా రాజేష్, మేడా అంజిబాబు, కంచర్లపల్లి నాగేంద్రం, నరసింహారావు, అంజనేయులు, గుడివాడ సంపత్ తదితరులు రంగాకు నివాళులర్పించారు.

కృత్తివెన్ను మండలంలో..

కృత్తివెన్ను: నీలిపూడిలో వంగవీటి రంగా విగ్రహానికి మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీనగరం, చెరుకుమిల్లి, చినపాండ్రాక, లక్ష్మీపురం, చందాల తదితర గ్రామాలలోని రంగా విగ్రహాల వద్ద ఆయన అభిమానులు నివాళులర్పించారు.

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: వంగవీటి మోహనరంగా వర్ధంతిని మచిలీపట్నంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రంగా చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, నాయకులు నివాళులర్పించారు. కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, పర్ణం సతీష్, పల్లి శేఖర్, ఐనం తాతారావు, మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, మొహమ్మద్ సాహెబ్, బడే భానుతేజ, చిత్తజల్లు రాజు, చిలకలపూడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు గాజుల నాగరాజు పాల్గొన్నారు. అదేవిధంగా చింతగుంటపాలెం సెంటరులోని రంగా విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు కారుమూరి శంకర్, మిరియాల రాంబాబు, శివాజీ, శంకర్ నివాళులర్పించారు. రేవతి సెంటరులోని రంగా విగ్రహం వద్ద రాధా, రంగా మిత్రమండలి అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు, మునిసిపల్ మాజీ చైర్మన్ బాబాప్రసాద్, టీడీపీ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఇలియాస్‌పాషా, పిప్పళ్ల కాంతారావు, మైనార్టీ విభాగం నాయకులు హసీమ్‌బేగ్ తదితరులు నివాళులర్పించారు.

రబీ సాగుకు మెలకువలు పాటించాలి



రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో శైలజ

పెనమలూరు: రబీ సాగులో రైతులు మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె గురువారం పెనమలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సంవత్సరం రబీలో 1156 రకం నారు ఎక్కువగా ఉందన్నారు. నారు తీసే ప్రధాన పొలంలో కార్బోఫ్యూరాన్ గుళికలు సెంటుకు 160 గ్రాముల చొప్పున వేసుకోవటం వలన పురుగు నివారించగలుగుతామన్నారు. నారు వేసిన తరువాత పొలంలో పొటాష్ వేయాలని అన్నారు. దమ్ములో 2 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ వేయాలని సూచించారు. అదే కాంప్లెక్స్ ఎరువులైతే 10–26–26, లేదా 14–35–14 వేసుకోవాలని అన్నారు. డీఏపీ, 20–20–0–13 ఎరువుల కన్నా 10–26–26, 14–35–14 ఎరువులు మెరుగని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు అనూష, రైతులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి పెట్టాలి



పెనమలూరు: విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించాలని మెకానికల్ ఇంజినీరింగ్‌లో విశిష్ట నిపుణుడిగా ఖ్యాతి గడించి దేశంలో పలు ఐఐటీలలో బోధించిన ప్రొఫెసర్ శేషు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో గురువారం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), మెషిన్ లర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్స్ వంటి కోర్సులు చదవటం నేడు విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. ఆధునిక టెక్నాలజీలపై పట్టు సాధించాలని సూచించారు. వైస్ చాన్స్‌లర్ వెంకటేశ్వరరావు, ప్రొ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, సీఎస్ఈ హెచ్‌వోడీ రాజేశ్వరరావు పాల్గొన్నారు.